## ఎమ్మెల్సీ శ్రవణ్‌కు సన్మానం



ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్‌ను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే ఆయన ఎమ్మెల్సీగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శ్రవణ్‌కుమార్‌కు రాజన్న శేష వస్త్రంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.
– వేములవాడ, ఏప్రిల్ 16

## బాధిత కుటుంబానికి ప్రమాద బీమా



నీలవ్వ కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 16: బొప్పాపూర్‌కు చెందిన బెస్త నీలవ్వ రెండేండ్ల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందగా, ఆమె కుటుంబానికి మంజూరైన రూ.5లక్షల ప్రమాద బీమా చెక్కును బీఆర్ఎస్ నాయకులు బుధవారం అందజేశారు. ఇక్కడ సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి, మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ల్యాగల సతీశ్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

# లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

- స్కానింగ్ సెంటర్లు నిబంధనలు పాటించాలి
- వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్
- జిల్లా అధికారులతో సమీక్ష



వైద్యాధికారులతో సమీక్షిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని ప్రైవేట్ దవాఖానల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ జిల్లా అధికారులను ఆదేశించారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సందీప్‌కుమార్‌తో కలిసి వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల్లో అత్యధిక ప్రసవాలు జరిగేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో నూతన దవాఖానల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరగాలని సూచించారు. నూతన స్కానింగ్ సెంటర్లు, పరీక్ష కేంద్రాల ఏర్పాటుకు కమిషనర్ అనుమతి తప్పనిసరి అని చెప్పారు. ప్రభుత్వ దవాఖానల్లో వైద్య సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన సిబ్బంది, వైద్యుల నియామకాలపై నివేదిక పంపాలని ఆదేశించారు. టీ.డయాగ్నస్టిక్, టీహబ్‌సెంటర్ల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఆడపిల్లల భ్రూణహత్యలు జరుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులలో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. ప్రతి వ్యాధికి సంబంధించిన మందులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రోగులు అనవసరంగా మందులు బయట కొనుక్కునే పరిస్థితి ఎట్టి పరిస్థితిలో రానివ్వదని సూచించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన తెలంగాణ డయాగ్నస్టిక్ సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రేడియాలజీ విభాగానికి సంబంధించి పరీక్షలు నివేదికలు ఎప్పటికప్పుడు అందజేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రజిత, లక్ష్మీనారాయణ, డాక్టర్ పెంచలయ్య, ప్రోగ్రాం ఆఫీసర్లు వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాధితులకు సత్వర సేవలు అందించాలి

- ప్రజలకు నమ్మకం కలిగేలా పని చేయాలి
- ఎస్పీ మహేశ్ బి గితే
- ఇల్లంతకుంట ఠాణా సందర్శన
- మొక్కల కోసం డ్రిప్ సిస్టం ప్రారంభం



డ్రిప్ సిస్టంను పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్ బి గితే

ఇల్లంతకుంట, ఏప్రిల్ 16: ఫిర్యాదు దారులు, బాధితులకు సత్వర సేవలు అందించాలని, పోలీసుల పై నమ్మకం కలిగేలా పని చేయాలని ఎస్పీ మహేశ్ బి గితే సిబ్బందికి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఠాణా మైదానంలో గతంలో ఏర్పాటు చేసిన మామిడి మొక్కలకు కొత్తగా ఏర్పాటు చేసిన డ్రిప్ సిస్టంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రౌడీ షీటర్ల పై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలని, ప్రస్తుతం వారి జీవన విధానం ఎలా ఉందో..? తెలుసుకోవాలని సూచించారు. గంజాయి రవాణా, అసాంఘిక కార్యకలాపాల పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక్కడ డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ మొగిలి, ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బంది ఉన్నారు.

## కేంద్రాల్లో వెనువెంటనే ధాన్యం కొనాలి

- మాజీ రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు



మాట్లాడుతున్న కల్వకుంట్ల గోపాల్‌రావు

ముస్తాబాద్, ఏప్రిల్ 16: కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెనువెంటనే కొనుగోలు చేయాలని రైతుబంధు మాజీ అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు సూచించారు. వాతావరణంలో మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారని, కొనుగోళ్లలో జాప్యం చేయొద్దన్నారు. బుధవారం ముస్తాబాద్ మండలకేంద్రంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని, వేసవి దృష్ట్యా కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ముస్తాబాద్‌లో రిపేరులో ఉన్న వైకుంఠ రథాన్ని వెంటనే బాగు చేయించాలని కోరారు. ఇక్కడ జడ్పీ మాజీ కోఆప్షన్ మెంబర్ సర్వర్ పాషా, ముస్తాబాద్ పట్టణ అధ్యక్షులు ఎద్దండి నరసింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు చెవుల మల్లేశం, సడిమెల ఎల్లం, ముస్తాబాద్ పట్టణ మాజీ అధ్యక్షుడు రాచమడుగు సంతోష్ రావు, ముస్తాబాద్ మాజీ కోఆప్షన్ మెంబర్ అన్వర్, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు శీలం స్వామి, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, రజక సంఘం నాయకుడు యాదగిరి, నాయకులు అంకని రంజిత్, గౌండయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED

**CHANGE OF NAME**

I, GEDELA SHANKAR RAO S/o. GEDELA NARAYANA RAO, R/o. H.No.21-6-93/6, Ex-Servicemen Colony, Gouthami Nagar, Mdl: Ramagundam, Dist: Peddapalli, TG, Have Changed My Name From GEDULASHANKARA RAO TO GEDELA SHANKAR RAO S/o.GEDELA NARAYANA RAO for all Purpose.

**CHANGE OF NAME**

I, MOHAMMAD RAFEE S/o. MOHAMMAD IMAM ALI, R/o. H.No.19-7-310, Ashok nagar, Godavarikhani, Ramagundam Mandal, Peddapalli District, TG, Have changed my Name From MAHAMMAD RAFI, S/o. MAHAMMAD IMAM ALI to MOHAMMAD RAFEE, S/o. MOHAMMAD IMAM ALI for all purpose.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

## ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మందులు విక్రయించాలి



మెడిసిన్‌ను పరిశీలిస్తున్న ఔషధ తనిఖీ అధికారి భవాని

వేములవాడ, ఏప్రిల్ 16: మెడికల్ షాపుల నిర్వాహకులు రాష్ట్ర డ్రగ్ కంట్రోల్ అథారిటీ నిబంధనలు పాటించాలని, వైద్యులు రాసిన ప్రిస్క్రిప్షన్ ఉన్నవారికే మందులు విక్రయించాలని జిల్లా ఔషధ తనిఖీ అధికారి భవాని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పలు మందులు దుకాణాలను తనిఖీ చేసి, ఆమె మాట్లాడారు. ప్రతి దుకాణం యజమాని కొనుగోలు చేసిన మందుల బిల్స్ తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. దుకాణాల్లో ఫార్మసిస్ట్ ఉండాల్సిందేనని, లేదంటే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

## పకడ్బందీగా ఎంపిక చేయాలి

- జిల్లా పంచాయతీ అధికారి ఎండీ షరీఫుద్దీన్

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 16: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికను పకడ్బందీగా చేపట్టాలని తంగళ్లపల్లి మండల ప్రత్యేక అధికారి, డీపీవో ఎండీ షరిఫుద్దీన్ సూచించారు. బుధవారం తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కమిటీలతో సమావేశమై, మాట్లాడారు. తంగళ్లపల్లి మండలానికి 597 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, గ్రామాల వారీగా నిర్దేశించిన లక్ష్యం మేరకు ఎంపిక చేయాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో ఇంటింటా తిరిగి, అర్హులైన వారిని ఎంపిక చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో లక్ష్మీనారా యణ, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కమిటీ సభ్యులు ఉన్నారు.

## పార దర్శకంగా ఇందిరమ్మ ఇండ్లు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 16: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని మండల ప్రత్యేకాధికారి అఫ్జల్ బేగం అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమై, మాట్లాడారు. నిబంధనలపై అవగాహన కల్పించారు. ఇక్కడ తహసీల్దారు సుజాత, ఎంపీవో జోగం రాజు, కార్యదర్శులు ఉన్నారు.

## అద్దె గదుల్లో తనిఖీ

వేములవాడ, ఏప్రిల్ 16: వేములవాడ పట్టణంలోని ప్రైవేట్ లాడ్జిలు, అద్దె గదులలో పట్టణ సీఐ వీరప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి 50 మంది పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ లాడ్జిల్లో చట్ట వ్యతిరేకమైన పనులు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. లాడ్జి, అద్దె గదుల కోసం వచ్చే వారి వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. తనిఖీల టైంలో డిటేయిల్స్ సక్రమంగా లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీలలో వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు మారుతి, వెంకట్రాజం, రమేశ్, ఉన్నారు.

## చందుర్తి ఏఎస్ఐ జిల్లా హెడ్ క్వార్టర్‌కు అటాచ్?

చందుర్తి,ఏప్రిల్ 16: చందుర్తి ఏఎస్ఐ సతీష్‌ను బుధవారం జిల్లా హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేసినట్లు తెలిసింది. గతంలో ఇక్కడే హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న టైంలో అనేక ఆరోపణలు రావడంతో ఆయన్ను కోనరావుపేట ఠాణాకు బదిలీ చేశారు. కొద్దిరోజుల తర్వాత చందుర్తి ఠాణాకు ఏఎస్ఐగా పదోన్నతిపై వచ్చారు. అయితే వారం కిందట ఠాణాలోనే విందు చేసుకోవడం, అలాగే వివిధ కేసులపై స్టేషన్‌కు వచ్చే బాధితులతో మాజీ ప్రజాప్రతినిధులను వెంట తీసుకొని రావాలని సూచించడమే వేటుకు కారణమని ప్రచారం జరుగుతున్నది. కాగా, ఈ విషయమై చందుర్తి సీఐ వెంకటేశ్వర్లును వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అటాచ్ చేసిన మాట వాస్తవమేనని చెప్పారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 16: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మద్దతు ధర కల్పించేందుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. బుధవారం బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ ఆవరణలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైస్ మిల్లర్లు ధాన్యం సేకరించక పోతే గోదాముల్లో నిల్వ చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. జిల్లా మొత్తం 191 కేంద్రాలను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఇక్కడ అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం, ఏఎంసీ చైర్మన్ సాబేరా భేగం, డీఆర్డీవో శేషాద్రి, డీఎస్‌వో వసంత లక్ష్మి, తహసీల్దార్ సుజాత, ఏపీవో మల్లేశం, నాయకులు దొమ్మాట నర్సయ్య, సద్ది లక్ష్మారెడ్డి ఉన్నారు.

## పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలకు ఆరోగ్యం



వేములవాడరూరల్: గర్భిణులు, చిన్నారులతో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, సీడీపీవో సౌందర్య

వేములవాడ రూరల్, ఏప్రిల్ 16: పౌష్టికాహారంతోనే తల్లీ బిడ్డలకు ఆరోగ్యమని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం పేర్కొన్నారు. చిన్నారుల తల్లులు, గర్భిణులు, బాలింతలు తప్పకుండా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్ష ఉత్సవాల్లో భాగంగా బుధవారం చెక్కపల్లి, అచ్చనపల్లి, ఎదురుగట్ల, శాత్రాజుపల్లి, అనుపురం, మారుపాక, హన్మాజీపేట తదితర గ్రామాల్లో పోషకాహారంపై చిన్నారుల తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఇక్కడ సీడీపీవో సౌందర్య, సూపర్‌వైజర్ నిర్మల, సఖీ ఇన్‌చార్జి రోజా, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, విమల, స్వరూప, ఉజ్వల, అమృత, భారతి పాల్గొన్నారు.

### తల్లి పాలే.. బిడ్డకు శ్రేయస్కరం

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 16: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని సీడీపీవో ఉమారాణి సూచించారు. బుధవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయంలోని సమావేశ మందిరంలో బుధవారం పోషణ పక్ష ఉత్సవాలు నిర్వహించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. తల్లీబిడ్డల సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇక్కడ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గొట్టెనిర్మల, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు ఉన్నారు.

కోనరావుపేట, ఏప్రిల్ 16: పోషక విలువలతో కూడిన ఆహారాన్ని చిన్నారులకు అందించాలని సూపర్ వైజర్ కనకమ్మ సూచించారు. పోషణ పక్ష ఉత్సవాల్లో భాగంగా బుధవారం కొలనూర్‌లో చిన్నారుల తల్లులు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఇక్కడ అంగన్‌వాడీ టీచర్లు, సీసీలు, సీఎలు, వీవోఎలు పాల్గొన్నారు.

## రాజన్నా.. మేడిపల్లి సత్తన్న మనసు మార్చు

- వేములవాడ రాజన్న, అగ్రహారం అంజన్నకు స్తంభంపల్లి గ్రామస్తుల మొక్కులు
- గంజివాగుపై హైలెవల్ వంతెన పూర్తి చేయాలని పాదయాత్ర




వేములవాడ రాజన్నకు మొక్కులు చెల్లించుకున్న అనంతరం ఆలయం ఎదుట స్తంభంపల్లి గ్రామస్తులు

వేములవాడ/ బోయినపల్లి/ కలెక్టరేట్, ఏప్రిల్ 16: 'ఎములాడ రాజన్నా.. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్తన్న మనసు మార్చు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కరుణించేలా చూడు..' అంటూ బోయినపల్లి మండలం స్తంభంపల్లి గ్రామస్తులు బుధవారం మొక్కులు చెల్లించుకున్నారు. వేములవాడ–బోయినపల్లి రహదారిలోని స్తంభంపల్లి–లక్ష్మీపూర్ గ్రామాల మధ్య గంజివాగుపై హై లెవల్ వంతెన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ గ్రామ మాజీ సర్పంచ్ అక్కనపల్లి జ్యోతి–కరుణాకర్ గ్రామస్తులతో కలిసి సిరిసిల్ల కలెక్టరేట్‌కు పాదయాత్రగా వచ్చారు. మార్గం మధ్యలో వేములవాడ రాజన్న, అగ్రహారం అంజన్నను దర్శించుకున్నారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు లోపలికి వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చేది వానకాలం అని, ఏటా వరదలకు గంజి వాగుపై రాకపోకలు నిలిచి తమ గ్రామంతోపాటు 30 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్‌లు బోంగాని అశోక్, వెంకటేశ్వర్‌రావు, రెడ్డి సంఘం అధ్యక్షుడు లింగారెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తిరుమలేష్, శాలివాహన సంఘం అధ్యక్షుడు రాచర్ల రాజేశ్, అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు అక్కెనపల్లి గణేశ్, అక్కినపల్లి రమేశ్, గొర్రె విజయ్, గౌడ సంఘం నాయకులు పులి అంజయ్య, కాసరపు మల్లేశం, ముత్యపు పరశురాములు తదితరులు ఉన్నారు.

## 'భూ భారతిపై సదస్సులు నిర్వహిస్తాం

కలెక్టరేట్, ఏప్రిల్ 16: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్వోఆర్ చట్టం భూ భారతిపై ఈ నెల 17 నుంచి 29 దాకా జిల్లాలోని మండలాలవారీగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సదస్సుల షెడ్యూల్ విడుదల చేశారు. 17న బోయినపల్లి మండలం, 19న ఇల్లంతకుంట, 21న కోనరావుపేట, 22న చందుర్తి, రుద్రంగి, 23న వేములవాడ రూరల్, వేములవాడ మండలం, 24న గంభీరావుపేట, 25న ముస్తాబాద్, 26న తంగళ్లపల్లి, 28న సిరిసిల్ల, 29న ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. భూ భారతి అవగాహన సదస్సులకు జిల్లా నోడల్ ఆఫీసర్‌గా సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయ్‌ని నియమించినట్లు తెలిపారు.

## నేడు ఆలయ అభివృద్ధిపై సమావేశం

ములవాడ టౌన్, ఏప్రిల్ 13: వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిపై గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధ్యక్షతన చైర్మన్ గెస్ట్ హౌస్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. సమావేశానికి దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, వీటీడీఏ వైస్ చైర్మన్, సీఈవో, రాజన్నసిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఆర్కిటెక్ట్స్, స్థపతులు, సంబంధిత ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఈ సమావేశంలో పాల్గొంటారని వెల్లడించారు. సమావేశం అనంతరం ఆలయ పరిసరాల్లో క్షేత్రస్థాయి పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు.

## సెస్ అధికారుల పరామర్శ

రుద్రంగి, ఏప్రిల్ 16: మండల కేంద్రంలో విద్యుత్ స్తంభంపై నుంచి కిందపడి దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యుత్ హెల్పర్ నరేష్‌ను బుధవారం సెస్ అధికారులు పరామర్శించారు. ఈ సందర్భంగా సెస్ ఏఈ కుమారస్వామి మాట్లాడుతూ నరేష్‌కు సెస్ సంస్థ అండగా ఉంటుందని, వైద్య ఖర్చులకు సంబంధించి పూర్తి బాధ్యత తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఇక్కడ సెస్ ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ సుబ్బరెడ్డి, ఎఎఓ జగదీష్ పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాలకు వేలం

వేములవాడ, ఏప్రిల్ 16: వేములవాడ అబ్కారి శాఖ పరిధిలో పట్టుబడ్డ ద్విచక్ర వాహనాలకు గురువారం వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ రాజశేఖర్ రావు బుధవారం ప్రకటనలో తెలిపారు. వేములవాడలోని ప్రొహిబిషన్,ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ఉదయం 11గంటలకు పలు వాహనాలకు వేలం నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని సూచించారు.

## ఫీల్డ్ అసిస్టెంట్ల ఆందోళన

వీర్నపల్లి, ఏప్రిల్16: తమ డిమాండ్లు నెరవేర్చాలని, సమస్యలు పరిష్కరించాలంటూ ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజనాయక్ మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవో అబ్దుల్ వజిద్‌కు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ మండలాధ్యక్షుడు నగరపు దేవేందర్, ఉపాధ్యక్షులు రాజు, ఎల్లయ్య, లోక్‌నాయక్, మనోజ్ ఉన్నారు.

## అనారోగ్యంతో మండల వైద్యాధికారి మృతి

చందుర్తి,ఏప్రిల్ 16: చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కే. వేదాచారి (35) అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన స్వగ్రామం వరంగల్ జిల్లా నర్సంపేట మండలం గురజాల. జిల్లాలోని పలు దవాఖానల్లో సేవలందించి చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా మొదటి పోస్టింగ్ తీసుకొని విధులు నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ బుధవారం ఉదయం మృతి చెందారు. ఆయన మృతిపై మండల ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## ప్లీనరీని విజయవంతం చేయండి

వేములవాడ టౌన్, ఏప్రిల్ 16: సికింద్రాబాద్‌లో 21న నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమ కళాకారుల రాష్ట్ర స్థాయి ప్లీనరీ సమావేశానికి రాష్ట్రంలోని ఉద్యమకళాకారులు అందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని రాష్ట్ర కన్వీనర్ ఎల్ల పోశెట్టి కోరారు. బుధవారం వేములవాడలోని తన నివాసంలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకళాకారుల ఫోరం డాక్టర్ చీమ శ్రీనివాసరావు ఆదేశాలమేరకు అన్ని జిల్లాల కన్వీనర్లు, కో–కన్వీనర్లు, కోఆర్డినేటర్లు, మండల అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు తరలిరావాలని సూచించారు.

## డబ్బుల కోసం తండ్రిపై దాడి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 16: డబ్బుల కోసం తండ్రిపై దాడి చేసిన కొడుకుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపల్లికి చెందిన వేముల సత్తయ్య మూడేండ్ల క్రితం తన భూమి అమ్మగా, రూ.18లక్షలు వచ్చాయి. అందులో కొడుకు రాజుకు రూ.12లక్షలు ఇచ్చాడు. మిగిలిన డబ్బులు తన వద్దే ఉంచుకున్నాడు. తండ్రి వద్ద ఉన్న డబ్బులు ఇవ్వాలని రాజు కొద్దిరోజులుగా అడుగుతున్నాడు. ఈ క్రమంలో తండ్రి తలపై బండరాయితో రాజు దాడి చేశాడు. బంధువులు గమనించి సత్తయ్యను దవాఖానకు తరలించారు. సత్తయ్య కూతురు రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## సభ సక్సెస్ కోసం ప్రచారం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 16: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతానికి పార్టీ కార్యకర్తలు నడుంబిగించారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. పదిరలో మాజీ సెస్ డైరెక్టర్ కుంబాల మల్లారెడ్డి కార్యకర్తలతో కలిసి డోర్ టూ డోర్ తిరుగుతూ పోస్టర్లను అతికించగా, వెంకటాపూర్‌లో మాజీ ఎంపీటీసీ మామిండ్ల తిరుపతిబాబు, నాయకులు నర్సయ్య వాల్ రైటింగ్ చేయించారు.

## నేడు సన్నాహక సమావేశం

ముస్తాబాద్, ఏప్రిల్ 16: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జనసమీకరణ కోసం సన్నాహక సమావేశాన్ని ముస్తాబాద్‌లోని మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు స్వగృహంలో గురువారం నిర్వహించనున్నట్లు ముస్తాబాద్ పట్టణ బీఆర్ఎస్ ఎద్దండి నర్సింహారెడ్డి తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని సూచించారు.

## పెద్దూరులో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 16: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరులో పలువురు లబ్ధిదారులకు బీఆర్ఎస్ నేత, మాజీ కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. మూటం శ్రీనివాస్‌కు రూ.15వేలు, వినుకొండ సిద్దయ్యకు రూ.11వేలు, శివరాత్రి లక్ష్మికి రూ.15వేలు మంజూరైనట్లు తెలిపారు. ఇక్కడ గుగ్గిల్ల దేవయ్యగౌడ్, విడుగురాళ్ల బాలయ్యగౌడ్, స్థానిక నేతలు ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చందుర్తి/ కోనరావుపేట, ఏప్రిల్ 16: చందుర్తి మండలంలో మర్రిమడ్ల, మూడపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇందూరి మధు, ఐకేపీ ఏపీఎం రజిత బుధవారం ప్రారంభించారు, అలాగే కోనరావుపేట మండలం మామిడిపల్లి, నాగారంతో కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య బుధవారం ప్రారంభించారు.